ప్రజాజ్యోతి
కరీంనగర్
రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి
బుధవారం19 ఆగస్టు 2026 www. praja jyothi news.com పేజీలు:14



## జర్నలిస్టుల స్థలాలపై కాంగ్రెస్ నేత కక్షసాధింపు..

- సీపీఐ నేత మర్రి వెంకటస్వామి నిప్పులు..
-మూడో రోజుకు చేరిన పాత్రికేయుల రిలే నిరాహార దీక్షలు.. -కాంగ్రెస్ వార్తలను బహిష్కరిస్తాం.. - జమ్మికుంట ప్రెస్ క్లబ్ హెచ్చరిక..

02

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు

# ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు
- సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అధికారిక వేడుకలు

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 18 ప్రజా జ్యోతి:**

సమానత్వానికి, వీరోచిత పోరాటానికి ప్రతీకగా నిలిచిన చారిత్రక యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ఆదేశాల మేరకు మంగళవారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల (బీసీ) అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను నిర్వహించారు.

మిగతా 2 లో



## పెద్దపల్లి లోని కూనారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనుల పరిశీలన



- పెండింగ్ భూ సేకరణను నిర్ణీత గడువులో పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- అక్టోబర్ 15 వరకు కునారం ఆర్ఓబీ పూర్తి చేయాలి
- భూ సేకరణపై రెగ్యులర్‌గా ఫాలోఅప్ చేస్తూ సమస్యలను పరిష్కరించాలి

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 18:**

అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.

మిగతా 2 లో

# కోరుట్ల ఎమ్మెల్యేకు చూపు మందగించిందా..?



- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు చూపించి ఉచిత ఆపరేషన్ చేయిస్తాం
- జువ్వాడి కృష్ణారావు ఎవరో తెలియదనడం విడ్డూరం..
- ఎమ్మెల్యే వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల ఘాటు విమర్శలు

**కోరుట్ల, ఆగస్ట్ 18 ప్రజాజ్యోతి**

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కు రాజకీయ వాస్తవాలు కనిపించడం లేదని, ఆయనకు చూపు మందగించిందేమోనని కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యాఖ్యానించారు. అవసరమైతే జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్‌కు చూపించి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని అన్నారు.కోరుట్ల పట్టణంలోని జువ్వాడి కృష్ణారావు స్వగృహం జువ్వాడి భవన్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు.బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేష్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పన్నాల అంజిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కొంతం రాజం, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎం.ఏ. నయీమ్ తదితరులతో కలిసి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ లు సమావేశం నిర్వహించారు.

మిగతా 2 లో

# జర్నలిస్టుల స్థలాలపై కాంగ్రెస్ నేత కక్షసాధింపు..

మొదటిపేజీ తరువాయి

**హుజూరాబాద్, ఆగస్టు 18, ప్రజా జ్యోతి :**

ప్రభుత్వమే అధికారికంగా సర్వే నంబర్లు కేటాయించి, ఇంటి నంబర్లు ఇచ్చిన జర్నలిస్టుల నివేశన స్థలాలపై అక్రమ కేసులు బనాయించి వారిని నడిరోడ్డుపైకి లాగడం అధికార కాంగ్రెస్ నాయకులు, రెవెన్యూ యంత్రాంగం అసమర్థతకు పరాకాష్ట అని సీపీఐ సీనియర్ నేత మర్రి వెంకటస్వామి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక కాంగ్రెస్ నేత గూడూరు స్వామిరెడ్డి వేసిన అక్రమ కేసులను నిరసిస్తూ హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం మూడో రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన పాత్రికేయుల పోరాటానికి సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు.

**పట్టాలిచ్చింది సర్కారే..**

ఎన్నికల సమయంలో కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ల సమక్షంలో చట్టబద్ధంగా 120 గజాల చొప్పున స్థలాలు కేటాయిస్తే, అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్న జర్నలిస్టులను నేడు కోర్టుల పేరుతో వేధించడం దుర్మార్గమని వెంకటస్వామి మండిపడ్డారు. ప్రభుత్వ రికార్డుల్లో స్పష్టత ఉన్నా, న్యాయస్థానం నుంచి ఎలాంటి స్టే ఉత్తర్వులు లేకపోయినా అధికారులు చేతులెత్తేసి కాలయాపన చేయడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీశారు.బాధిత జర్నలిస్టులకు తక్షణమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ బాబు వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు, అధికారులు లిఖితపూర్వక హామీ ఇవ్వకపోతే ఉద్యమాన్ని జిల్లా వ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కాంగ్రెస్ వార్తలను బహిష్కరిస్తాం.. -జమ్మికుంట ప్రెస్ క్లబ్ అల్టిమేటం..జర్నలిస్టుల స్థలాలపై కాంగ్రెస్ నేత స్వామిరెడ్డి వేసిన కేసును వెంటనే ఉపసంహరింపజేయాలని, లేనిపక్షంలో జమ్మికుంట ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు, వార్తలను పూర్తిగా బహిష్కరిస్తామని జమ్మికుంట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నర్సింగ్ శ్రీనివాస్ తేల్చిచెప్పారు. దీక్షా శిబిరానికి మద్దతు తెలిపిన ఆయన, అధికార పార్టీ నేతల తీరును తీవ్రంగా ఖండించారు.ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ నేతలు వంగల హనుమంత్ గౌడ్, వేల్పుల రత్నం, ఓసీ జేఏసీ నాయకురాలు ప్రభావతి రెడ్డి, బీసీ జేఏసీ నేత చందుపట్ల జనార్దన్, ముదిరాజ్ సంఘం నేత కొలిపాక సమ్మన్నతో పాటు జమ్మికుంట జర్నలిస్టులు నసిరుద్దీన్, సదానందం, భీమన్న, సాయికుమార్, రవి, రఘుపతి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

మొదటిపేజీ తరువాయి

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు జ్యోతి ప్రజ్వలన చేసి, పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూలి సర్వాయి పాపన్న గౌడ్ 1650 ఆగస్టు 18న ఒక సాధారణ కుటుంబం జన్మించి, అసాధారణ సాహసంతో గోల్కొండ కోటను స్వాధీనం చేసుకుని గొప్ప పరిపాలన అందించారని ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాలు త్యాగాలను స్మరించుకుంటూ ఏటా అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించడం గర్వకారణమన్నారు.బీసీ సంఘాల నాయకుల విజ్ఞప్తి మేరకు, భవిష్యత్తులో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మండల, గ్రామ స్థాయిలో అధికారికంగా నిర్వహించేలా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అదనపు కలెక్టర్ తెలిపారు.

**ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారిజె.రంగారెడ్డి, జిల్లా అధికారులు, జిల్లా బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.**

# కోరుట్ల ఎమ్మెల్యేకు చూపు మందగించిందా..?

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఎవరో తెలియదని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. కోరుట్ల నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వ్యక్తి జువ్వాడి కృష్ణారావు అని పేర్కొన్నారు.స్వర్గీయ జువ్వాడి రత్నాకర్‌రావు తనయుడిగా, ధర్మపురి దేవస్థానం మాజీ చైర్మన్‌గా జువ్వాడి కృష్ణారావుకు నియోజకవర్గంలో ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు. కోరుట్ల పట్టణంలో ఆయనకు స్వగృహం ఉండటంతో పాటు, ఆయన ఓటు కూడా కోరుట్ల నియోజకవర్గంలోనే ఉందని గుర్తుచేశారు.

**- ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ కోసం పోరాటం చేశాం**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూతపడిన ముత్యంపేట చక్కెర కర్మాగారాన్ని తిరిగి తెరిపించేందుకు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో గతంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ప్రతి నెల 22వ తేదీన ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ వరకు పాదయాత్రలు నిర్వహించిన విషయాన్ని ఎమ్మెల్యే మర్చిపోయారా అని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు.కోరుట్ల నియోజకవర్గం అభివృద్ధిలో స్వర్గీయ జువ్వాడి రత్నాకర్‌రావు చేసిన సేవలు కీలకమని, గత బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన అనేక హామీలు అమలు కాలేదని వారు విమర్శించారు.

**- కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలుకు కృషి చేస్తోంది**

కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.బీడీ కార్మికుల పెన్షన్ల విషయంలో గత ప్రభుత్వ వైఖరిపై కూడా వారు విమర్శలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో మిగులు బడ్జెట్‌లో ఉందని చెప్పుకున్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అప్పుల రాష్ట్రంగా మార్చిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై కూడా వారు ప్రశ్నలు సంధించారు.

**- ప్రజా సమస్యలపై మాట్లాడే హక్కు మాకు ఉంది**

ప్రజల మధ్య నిరంతరం ఉంటూ సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న జువ్వాడి కృష్ణారావుపై ఎమ్మెల్యే సంజయ్ వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని కాంగ్రెస్ నేతలు అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నాయకుడి గురించి మాట్లాడే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు.అలాగే సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తుంటే, కోరుట్ల నియోజకవర్గంలోని సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి ఎమ్మెల్యే కనీసం పూలమాల వేయలేదని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు.

**- అహంకారపూరిత వ్యాఖ్యలు మానుకోవాలి**

ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఇకపై అహంకారపూరిత వ్యాఖ్యలు చేయకుండా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ నేతలు సూచించారు. జువ్వాడి కృష్ణారావుపై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన రాజకీయ సమాధానం ఇస్తామని హెచ్చరించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని వారు తెలిపారు.ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు ఎలేటి మహిపాల్ రెడ్డి, కిసాన్ సెల్ నాయకుడు పోతుగంటి శంకర్ గౌడ్, నాయకులు సురేష్, నర్సారెడ్డి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాల్లపూర్‌లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

**వీణవంక, ఆగస్ట్ 18(ప్రజాజ్యోతి)**

వీణవంక మండల పరిధిలోని వాల్లపూర్ గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. ఆయన చూపిన ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమని అన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రెసిడెంట్ పెరుమాండ్ల సమ్మయ్య, వైస్ ప్రెసిడెంట్ పల్లె స్వామి, సభ్యులు పల్లె రాజమల్లు, తాళ్లపల్లి రవీందర్, బుర్ర రామస్వామి, అగ్గి శ్రీనివాస్, వాడ్లకొండ చిరంజీవి, మోటపోతుల చంద్ర, మొగిలి తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, క్యాప్ శీను తదితరులు పాల్గొన్నారు.



# పెద్దపల్లి లోని కూనారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనుల పరిశీలన

మొదటిపేజీ తరువాయి

మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములతో కలిసి అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ భూ సేకరణపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి బైపాస్ రోడ్డు, కూనారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, తదితర అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.భూ సేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా రెగ్యులర్‌గా ఫాలోఅప్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల సమన్వయంతో వెంటనే పరిష్కరించాలని సూచించారు.భూ యజమానులకు సంబంధించిన సమస్యలు, భూ వివరాల పరిశీలన, రికార్డుల పరిశీలన, పరిహారం చెల్లింపులు తదితర అంశాలను వేగవంతం చేయాలని తెలిపారు. అభివృద్ధి పనులకు భూ సేకరణ కీలకమైనందున, పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణీత లక్ష్యాల మేరకు పురోగతి సాధించాలని అధికారులను ఆదేశించారు.భూ సేకరణ సజావుగా జరిగేలా అవసరమైన చోట భూ యజమానులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించాలని, అభివృద్ధి పనుల పురోగతికి భూ సేకరణ కారణంగా ఎలాంటి జాప్యం జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అనంతరం కూనారం ఆరోబీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ అక్టోబర్ 15 నాటికి రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తి చేసి వాహనాల రాకపోకలు జరిగే విధంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈ ఈ. భావ్ సింగ్ , రెవెన్యూ డివిజనల్ అధికారులు బి. గంగయ్య, సంబంధిత అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

# కోనరావుపేటలో సర్దార్ సర్వాయి పాపన్న 376 వ జయంతి వేడుకలు..

**కోనరావుపేట, ఆగస్టు.18(ప్రజా జ్యోతి)**



కోనరావుపేట మండల కేంద్రంలోని నిమ్మపెల్లి క్రాస్ రోడ్డు వద్ద సర్దార్ సర్వాయి పాపన్న 376 వ జయంతి వేడుకలను కోనరావుపేట మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు అబ్బసాని శంకర్ గౌడ్ మాట్లాడుతూ...బహుజనుల రాజ్యాధికారం కోసం పోరాడి మొఘలులను ఎదిరించి గోల్కొండ కోటపై జెండా ఎగురవేసిన ధీశాలి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. పాపన్న గౌడ్ సాగించిన పోరాటం బహుజన వర్గాలకే కాకుండా నేటి ఉద్యమకారులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని అన్నారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ,ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆయన స్ఫూర్తితో రాజ్యాధికారం దిశగా బహుజనులంతా ఏకమై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుండా వెంకటేష్ గౌడ్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంగలి వెంకన్న గౌడ్,ప్యాక్స్ డైరెక్టర్ కాసారపు శ్రీనివాస్ గౌడ్,మండల ప్రధాన కార్యదర్శి తీగల రవీందర్ గౌడ్,నాయకులు బైరగోని నందు గౌడ్,దొంతరవేని శ్రీనివాస్ గౌడ్,తాళ్లపల్లి శ్రీకాంత్ గౌడ్,అంజయ్య గౌడ్,శ్రీనివాస్ గౌడ్,దిలీప్ గౌడ్,రవి గౌడ్,తిరుపతి గౌడ్,రమేష్ గౌడ్,సత్తయ్య గౌడ్,దేవయ్య గౌడ్,తదితరులు పాల్గొన్నారు.




# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై కేసును వెంటనే ఉపసంహరించుకోవాలి..

## - జేఏసీ నేత వంగల హనుమంత్ గౌడ్ డిమాండ్..

**హుజూరాబాద్, ఆగస్టు 18, ప్రజా జ్యోతి :**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పేద జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై కాంగ్రెస్ నేత గూడూరి స్వామి రెడ్డి కోర్టులో వేసిన కేసును బేషరతుగా ఉపసంహరించుకోవాలని జేఏసీ నాయకులు వంగల హనుమంత్ గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పరిరక్షణ కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకోగా, దీక్షా శిబిరాన్ని సందర్శించిన హనుమంత్ గౌడ్ జర్నలిస్టులకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా వంగల హనుమంత్ గౌడ్ మాట్లాడుతూ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. జర్నలిస్టులకు కేటాయించిన భూమి పూర్తిగా చట్టబద్ధమైనదని స్పష్టం చేశారు. వీఆర్వో, గిర్దావర్ (ఆర్ఐ), డిప్యూటీ తహశీల్దార్, ఎంఆర్వో, ఆర్డీవో, జేసీల పరిశీలన అనంతరం స్వయంగా జిల్లా కలెక్టర్ సంతకం చేసిన సర్వే నంబర్ల అధికారిక పట్టాలను లబ్ధిదారులకు అందజేశారని తెలిపారు. రెవెన్యూ యంత్రాంగం నిబంధనల ప్రకారం కేటాయించిన ప్రభుత్వ భూమిపై కావాలని కేసులు వేసి జర్నలిస్టులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. సమస్య పరిష్కారంపై కలెక్టర్, ఆర్డీవో లేదా ఎమ్మార్వో నుంచి లిఖితపూర్వక హామీ లభించేంత వరకు దీక్షా శిబిరాన్ని ఎత్తివేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ నేత నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ప్రణవ్ బాబు చొరవ తీసుకోవాలి..**

అధికారంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కేసు వేసిన వ్యక్తి కూడా ఆ పార్టీకి చెందినవారేనని గుర్తుచేశారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వొడితల ప్రణవ్ బాబు, మంత్రులు పెద్దమనసుతో చొరవ తీసుకుని ఈ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం, పేద జర్నలిస్టుల న్యాయమైన హక్కుల కోసం సాగే ఈ పోరాటానికి జేఏసీ తరఫున నైతిక మద్దతుతో పాటు అవసరమైన సహకారాన్ని కూడా అందిస్తామని హనుమంత్ గౌడ్ భరోసా ఇచ్చారు.

# కందికట్కూరులో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలు

## - గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి రవీందర్ గౌడ్

**ఇల్లంతకుంట ఆగస్టు 18(ప్రజా జ్యోతి)**

తెలంగాణ గడ్డపై పుట్టి, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన మహావీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్.అని గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్ గౌడ్ అన్నారు మంగళవారం రోజు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూర్ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రవీందర్ గౌడ్ మాట్లాడుతూ పాపన్న గౌడ్ ఆశయాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, ఐక్యత కోసం ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండలం గౌడ సంఘం అధ్యక్షుడు గజ్జెల రాజశేఖర్ గౌడ సంఘం ఉపాధ్యక్షులు విప్లవ్ గౌడ్ ఉప సర్పంచ్ అజయ్ మండల ప్యాక్స్ వైస్ చైర్మన్ యాస తిరుపతి మాజీ సర్పంచ్ అమర్. బిగుళ్ళ అనిత తిరుపతి మాజీ ఎంపీటీసీ దొమ్మాటి కిషోర్ గౌడ్ వార్డు సభ్యులు క్యాషియర్ లక్ష్మణ్ గౌడ సంఘం డైరెక్టర్లు అంజయ్య లక్మిరాజ్యం కనకయ్య శేఖర్ కనకయ్య శ్రీనివాస్ సురేష్ గౌడ సంఘం సభ్యులు ముత్యం రాములు రోషాల్ గౌడ్ రామచంద్రం దొమ్మాటి కిరణ్ వెంకటేశం బత్తిని శ్రీనివాస్ తాళ్లపెల్లి శ్రీహరి రంగు రజినీకాంత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.





## పది వసంతాలు పూర్తి చేసుకున్న వేములవాడ మహాలక్ష్మి దంత వైద్యశాల

### - డాక్టర్ కోయినేని రాజేందర్

**వేములవాడ,ఆగస్టు,18:ప్రజాజ్యోతి.**

వేములవాడ పట్టణంలోని ప్రముఖ మహాలక్ష్మి దంత వైద్యశాల పది సంవత్సరాల సుదీర్ఘ సేవా ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని 11వ వసంతంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని హాస్పిటల్ అధినేత డాక్టర్ కోయినేని రాజేందర్ పట్టణ పుర ప్రముఖులకు, ప్రజాప్రతినిధులకు మరియు వేములవాడ పరిసర ప్రాంత ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత దశాబ్ద కాలంగా తమ వైద్యశాల ప్రగతిలో భాగస్వాములై, నమ్మకంతో ఆదరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ఎల్లప్పుడూ మర్చిపోలేనని సంతోషం వ్యక్తం చేశారు. వైద్యశాల 11వ వసంతంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలనే ఉద్దేశంతో ఒక కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. రోగుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ వారం రోజుల పాటు ఉచిత ఓపి దంత వైద్య సేవలు అందించనున్నట్లు డాక్టర్ రాజేందర్ ప్రకటించారు. ఈనెల ఆగస్టు 17 నుంచి 22 వరకు ఉచిత వైద్య ఓపి సేవలు నిర్వహిస్తున్నామని అన్నారు.



## ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఆవిష్కరణకు ..... తరలిన ఎల్లారెడ్డిపేట గౌడ నాయకులు....

**ఎల్లారెడ్డిపేట ఆగస్టు 18 (ప్రజా జ్యోతి)**

ఎల్లారెడ్డిపేట మండలంలోని గౌడ సంఘం సభ్యులు హైదరాబాదు లోని ట్యాంక్ బండ్ పై శ్రీ సర్వాయి సర్దార్ పాపన్న విగ్రహావిష్కరణకు మండలం నుంచి చిట్యాల కృష్ణమూర్తి , గంటా అంజా గౌడ్ ,సంతోష్ గౌడ్, తిరుపతి గౌడ్ నాయకులు తరలి వెళ్లారు .ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతంగా జరిగిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు.



## ఇంకుడు గుంతల నిర్మాణానికి ముగ్గు పోసిన సర్పంచ్ బంగారి రమేష్

**కాల్వ శ్రీరాంపూర్, ఆగస్టు 19, ప్రజాజ్యోతి:**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో విబిజి రాంజీ పథకంలో మంజూరైన ఇంకుడు గుంతలకు ముగ్గు పోసి పనులను సర్పంచ్ బంగారు రమేష్ మంగళవారం రోజున ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ అశోక్ కుమార్, ఉప సర్పంచ్ గోలి సుధాకర్, వార్డు సభ్యుడు జనగామ అనిత అన్వేష్, కారోబర్ గట్టయ్య., తదితరులు పాల్గొన్నారు.

# జోగాపూర్ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహా ఆవిష్కరణ

**వేములవాడ,ఆగస్టు,18:ప్రజాజ్యోతి.**

చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో గౌడ సంఘం,గౌడ యువసేన ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గీత కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సంపునూరి మల్లేశం గౌడ్,సీనియర్ న్యాయవాది నేరెళ్ల తిరుమల్ గౌడ్,మాజీ జడ్పీటీసీ నాగం కుమార్. సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేష్.సర్పంచ్ షాహానాజ్ సమీర్ హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ చేశారు. గ్రామ ప్రజాప్రతినిధులు మండల ప్రజాప్రతినిధులు పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక పాపన్న గౌడ్ అని కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కేవలం ఒక యోధుడు మాత్రమే కాకుండా సామాజిక అసమానతలను ప్రశ్నించిన ధైర్యశాలి అని అన్నారు. అణగారిన వర్గాలకు ఆత్మగౌరవం, సమానత్వం, స్వాభిమానం ఉండాలని తన పోరాటం ద్వారా చాటి చెప్పారని పేర్కొన్నారు. జోగా పూర్ గౌడ సంఘం యువకులు ఐకమత్యంగా ఉంటూ పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. జోగపూర్ గౌడ యువకులను ఆదర్శంగా తీసుకొని ప్రతి గ్రామంలో సర్దార్



సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పులి సత్యం గౌడ్. మోకానపల్లి దేవరాజు. దూది మనిషా- శ్రీనివాసరెడ్డి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మ్యాకల ఎల్లయ్య. బిజెపి పార్టీ మండల అధ్యక్షులు మొకిలే విజేందర్ నాయకులు మల్లేశం గౌడ్,నాగం.రాజమల్లయ్య.రాజా గౌడ్. నారాయణ గౌడ్. పల్లి ప్రశాంత్ గౌడ్. శ్రీకాంత్ గౌడ్. బోనాల మహేష్ గౌడ్. వికృతి లక్ష్మీనారాయణ. దూలం. సంపత్ గౌడ్. నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతల నిర్మాణానికి ముగ్గులు పోసిన సర్పంచ్ బంగారి రమేష్

**కాల్వ శ్రీరాంపూర్ ఆగస్టు 19 ప్రజా జ్యోతి**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో వి బి జి రాంజీ పథకంలో. మంజూరైన ఇంకుడు గుంతల కు.ముగ్గులు పోసి పనులను సర్పంచ్ బంగారు రమేష్. మంగళవారం రోజున ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ అశోక్ కుమార్. ఉప సర్పంచ్ గోలి సుధాకర్. వార్డు సభ్యులు. జనగామ అనిత అన్వేష్. కారోబర్ గట్టయ్య. తదితరులు పాల్గొన్నారు.



## దొంగతుర్తిలో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**ధర్మారం, ఆగస్టు18(ప్రజా జ్యోతి):**

మండలంలోని దొంగతుర్తి గ్రామంలో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ధైర్యసాహసాలు, సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటాన్ని నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమానికి గౌడ సంఘం అధ్యక్షుడు ముక్కెర ఆశాలు అధ్యక్షత వహించగా, ఉపాధ్యక్షులు పాలకుర్తి తిరుపతి,బాలసాని లింగయ్య, సభ్యులు పాలకుర్తి రాజయ్య,బండి శ్రీకాంత్, బొంగాని అరుణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామ సర్పంచ్ కొడారి మంగ, ఉపసర్పంచ్ తమ్మడవేణి రాజయ్య, మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, వార్డు సభ్యులు పాలకుర్తి సాగర్, ముక్కెర సత్తమ్మ, ముక్కెర రజిత, దాడి సదయ్యతో పాటు ఆలువాల భాగ్యరాజేశం, కొమ్మ శ్రావణిపరమేష్, గొట్టే మధుకర్, ఈర్ల రాజేందర్ తదితరులు, గౌడ్ సంఘం సభ్యులు పాల్గొని సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళులర్పించారు.



## ఎల్లారెడ్డిపేట జిపిఓ కు ఆత్మీయ సన్మానం

**ఎల్లారెడ్డిపేట ఆగస్టు (ప్రజా జ్యోతి)**



ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఎల్లారెడ్డిపేట జిపిఓ రజిని ఆగస్టు 15న ఉత్తమ అవార్డును కలెక్టర్ ద్వారా తీసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగా గిరిధర్ రెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాటి రామ్రెడ్డి, చిన్ని బాబు, బండారు బాల్రెడ్డి ,అంతర్పుల గోపాల్ ,శ్రీపాల్ రెడ్డి, బీబీపేట రాజు తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం శాలువాతో సన్మానించారు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నందుకు ప్రభుత్వము ఉత్తమ సేవలు అవార్డు ప్రకటించ పట్ల పలువురు జిపిఓ రజిని అభినందించారు.

ప్రజాజ్యోతి

బుధవారం19 ఆగస్టు 2026

# రాచర్ల తిమ్మాపూర్ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**ఎల్లారెడ్డిపేట ఆగస్టు 18 ప్రజా జ్యోతి**

ఎమ్మారెడ్డిపేట మండలంలో ని రాచర్ల తిమ్మాపూర్ లో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు గౌడ సంఘం అధ్యక్షుడు కొండ పరశు రాములు కేక్ కట్ చేసి సర్వాయి పాపన్న గౌడ్ వేసి చారు చేసిన పోరాటాన్ని గోల్కొండ రాజ్యాన్ని స్థాపించాడు, జీవిత విశేషాలను, ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు .ఈ కార్యక్రమంలో గౌడ సంఘం కొండ శ్రీనివాస్ పల్లె శంకరయ్య రాజు గౌడ్ రమేష్ గౌడ్ వెంకటేష్ అంజా గౌడ్ గౌడ్ బొంబోతుల అంజయ్య గౌడ్ ప్రశాంత్ ధీరజ్ గౌడ్ దీక్షిత్ గౌడ్ స్కైలాబ్ దేవయ్య సభ్యులు పాల్గొన్నారు.



# భూ ధరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు

## - తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**కొడిమ్యాల,ఆగస్ట్ 18,(ప్రజాజ్యోతి):**

భూ భారతి కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం, జాప్యం సహించేది లేదని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన.. పెండింగ్ ఫైళ్లపై ఆరా తీశారు.భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు, సాదా బైనామాలు, మీసేవ ఫైళ్లను పరిశీలించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మీసేవ ద్వారా అందించే సర్టిఫికెట్లను పెండింగ్లో ఉంచకుండా వెంటనే జారీ చేయాలని ఆదేశించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు అందించడంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యాలయంలో సమయపాలన పాటించాలని, నివేదికలను గడువులోగా సమర్పించాలని సూచించారు. తనిఖీలో ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ నరేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.





# సుద్దాలలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**కొనరావుపేట, ఆగస్టు.18(ప్రజాజ్యోతి)**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాజిక న్యాయం ఆత్మ గౌరవం కోసం పోరాడిన గొప్పయోధుడని కొనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, అన్నారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, ముఖ్య అతిథిగా పాల్గొని సర్పంచ్ కుంటెల్లి నాగరాజు తో కలిసి ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాయి, వార్డు సభ్యులు బుర్ర రమేష్, విజయ్, బాబు, భూమేష్,గంగయ్య,నాయకులు మహేష్, గౌడ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మల్లేశం, సభ్యులు బుర్ర శ్రీనివాస్, బుచ్చి రాములు, శ్రీనివాస్ ,రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

## - నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

## - బీసీ సంక్షేమ శాఖ ఆద్వర్యంలో వేడుకలు

**రాజన్న సిరిసిల్ల ప్రతినిది ఆగస్టు - 18 (ప్రజాజ్యోతి)**

సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బీసీ సంక్షేమ శాఖ ఆద్వర్యంలో నిర్వహించగా,ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరై పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్య క్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సౌజన్య, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి హనుమంతు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, గౌడ సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.





# గంభీరావుపేట లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ, జయంతి వేడుకలు

**గంభీరావుపేట ఆగస్టు 18 (ప్రజాజ్యోతి);**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలను గౌడ సంఘం మండల అధ్యక్షులు చీరాల వెంకటస్వామి గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం రోజు ఘనంగా నిర్వహించారు. సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి గౌడ సంఘ సభ్యులు పూలమాలలు వేసి కొబ్బరికాయ కొట్టి, టపాసులు కాల్చి సంబరాలు ఘనంగా చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గౌడ సంఘ సభ్యులు మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి అనేది ఒక వ్యక్తి పుట్టినరోజు వేడుక మాత్రమే కాదు; ధైర్యం, స్వాభిమానం, ప్రజా నాయకత్వం, సామాజిక సమానత్వం కోసం పోరాటాన్ని గుర్తుచేసుకునే రోజుగా తెలంగాణలో ప్రాధాన్యత పొందింది అని అన్నారు.ఈ కార్యక్రమంలోపాపగారి వెంకటస్వామి గౌడ్ లక్ష్మం పురం రాజు గౌడ్, పాప గారి యాదగిరి గౌడ్, పాపగారి రాజు గౌడ్, బంగ్లా రాజు గౌడ్, లింగంపల్లి అంజా గౌడ్, కోల నాంపల్లి గౌడ్, చేరాల రాజు, గుర్రం రాజు గౌడ్ చేరాల అరవింద్ గౌడ్, పాప గారి శ్రీనివాస్ గౌడ్, చేరాల రాజా గౌడ్, గుర్రం నాగరాజ్ గౌడ్ ,లింగంపల్లి పరశురాములు, గొల్లపల్లి నాగరాజు గౌడ్, సాహెబ్ గారి స్వామి, శ్రీనివాస్ గౌడ్, చందు గౌడ్, నారాయణ గారి అరుణ్ గౌడ్, గడ్డమీద స్వామి గౌడ్, గొల్లపల్లి నరేష్ గౌడ్, సాహెబ్ గారి సంతోష్ గౌడ్, తో పాటు పలువురు గౌడ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**వేములవాడ,ఆగస్టు,18:ప్రజాజ్యోతి.**

వేములవాడ పట్టణంలో కోరు ట్ల బస్సు స్టాండ్ సర్వాయి పా పన్న జయంతి ఉత్సవాలలో బీజేపీ సీనియర్ నాయకుడు మామిండ్ల. లక్ష్మి రాజంపాల్గొని, పాపన్న విగ్రహం పూలమాల లు వేసి ఘనముగా నివాళు లు అర్పించారు. 17వ శతాబ్దానికి చెందిన గొప్ప తెలంగాణ వీరయోధుడు, మొ ఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకం గాపోరాడినతొలిబహుజనచక్రవర్తి. సామాన్య గౌడ కుటుంబం లో జన్మించిన ఆయన,అణగా రిన వర్గాల ఆత్మగౌరవం కోసం, సామాజిక న్యాయం కోసం గెరి ల్లా సైన్యాన్ని నిర్మించి రాజ్యాధి కారాన్ని సాధించారన్నారు. మన బహుజన సమాజం పాప న్నగౌడ్,జీవితంఆదర్శంగాతీచుకొని జీవించాలన్నారు.



# పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలి,

**ఎండపల్లి, ఆగస్టు 18, ప్రజా జ్యోతి**

మండలంలోని గుల్లకోటలో గీత కార్మికుల సంక్షేమ సంఘం (గౌడ సంఘం)అధ్యక్షుడు గొల్లపల్లి సత్యం గౌడ్,గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాపన్న గౌడ్ చూపిన ధైర్యసాహసాలు, సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. గౌడుల ఐక్యతను మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు బిసగోని అంజి గౌడ్, గౌరవ అధ్యక్షుడు గొల్లపల్లి శంకర్ గౌడ్, పొన్నం నరేష్ గౌడ్, గర్వంద ఎల్ల గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, పొన్నం వెంకటేష్ గౌడ్, గుండ గంగయ్య గౌడ్, అమరగొండ దివాకర్ గౌడ్, పొన్నం కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ధరూర్ క్యాంప్‌లో నూతన జగిత్యాల ఆర్డీవో కార్యాలయ స్థల పరిశీలన: జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల టౌన్, ఆగస్టు 18 (ప్రజా జ్యోతి):**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌లో నూతనంగా నిర్మించ తలపెట్టిన ఆర్డీవో రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ భవన నిర్మాణ భూ స్థలాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్.. భవన నిర్మాణానికి స్థలం ఎంతవరకు అనుకూలంగా ఉంటుంది, అందుబాటులో ఉన్న మొత్తం విస్తీర్ణం ఎంత, భవిష్యత్తులో ప్రజలకు అందుబాటులో ఉండేలా మౌలిక వసతుల కల్పనకు ఉన్న అవకాశాలు తదితర కీలక అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. కార్యాలయ భవన నిర్మాణానికి సంబంధించిన బ్లూప్రింట్, ప్రతిపాదనలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేసేందుకు, మెరుగైన సేవలందించేందుకు నూతన ఆర్డీవో కార్యాలయ భవన నిర్మాణాన్ని తలపెట్టామన్నారు. స్థల పరిశీలన పూర్తయినందున, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలను వేగవంతం చేయాలని, అవసరమైన నివేదికలను సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రామ్మోహన్, హౌసింగ్ డి.ఈ. భాస్కర్, రెవెన్యూ మరియు హౌసింగ్ శాఖలకు చెందిన ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# డ్రగ్స్‌కు దూరంగా.. భవిష్యత్‌పై దృష్టి

## - జూనియర్ కళాశాలలో యాంటీ డ్రగ్స్, పోక్సోపై అవగాహన

**కొడిమ్యాల,ఆగస్ట్ 18,(ప్రజాజ్యోతి):**



మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా విద్యార్థులు తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని ఎస్సై ఎ.నరేష్ కుమార్ సూచించారు. ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం యాంటీ డ్రగ్స్, పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.గోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎస్సై ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. డ్రగ్స్ వినియోగం విద్యార్థుల ఆరోగ్యం, చదువు, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. చెడు స్నేహాలు, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, చట్టపరమైన నిబంధనలను వివరించారు. పోక్సో చట్టంపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలలు, బాలికలను లైంగిక నేరాల నుంచి రక్షించేందుకు ఈ చట్టం అమల్లో ఉందని తెలిపారు. అనుచిత ప్రవర్తన ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# వన మహోత్సవంలో విస్తృతంగా మొక్కల పంపిణీ

## - చెట్లను పెంచుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

## - పచ్చని చెట్లే ప్రగతికి మెట్లు

**కోరుట్ల, ఆగస్టు 18 ప్రజాజ్యోతి**



వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా కోరుట్ల పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు వార్డు ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. పచ్చని చెట్లే ప్రగతికి మెట్లు అని పేర్కొంటూ, మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు.పట్టణాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, వన మహోత్సవ స్ఫూర్తితో మొక్కలను నాటి వాటిని కాపాడాలని కోరారు.



ఈ కార్యక్రమంలో వివిధ వార్డుల కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అసిస్టెంట్ కుక్/హెల్పర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**ధర్మారం,ఆగస్టు18(ప్రజా జ్యోతి):**

ధర్మారం మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహంలో అసిస్టెంట్ కుక్/హెల్పర్ పోస్టుకు పూర్తి స్థాయి కాంట్రాక్ట్ ప్రాతిపదికన అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు మండల విద్యాధికారి పోత ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పోస్టుకు ధర్మారం మండలంలో నివసించే, 7వ తరగతి ఉత్తీర్ణులై, 25 నుంచి 55 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు.అర్హత కలిగిన అభ్యర్థులు 2026 ఆగస్టు 19 నుంచి 23వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు ఆధార్ కార్డు,కుల ధ్రువీకరణ పత్రం,నివాస ధ్రువీకరణ పత్రం, 7వ తరగతి ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రం జత చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తులను తెలంగాణ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహం కేర్‌టేకర్/వార్డెన్‌కు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోపు సమర్పించాలని మండల విద్యాధికారి పి. ప్రభాకర్ తెలిపారు.



# స్మార్ట్ రేషన్ కార్డులపై మోదీ ఫోటో ఏర్పాటు చేయాలి, తహసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన బీజేపీ నాయకులు

**ఎండపల్లి, ఆగస్టు 18,ప్రజా జ్యోతి**

స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫోటో ఏర్పాటు చేయాలని కోరుతూ ఎండపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు రావు హనుమంతరావు ఆధ్వర్యంలో మంగళవారం మండల తహసీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ.కేంద్ర ప్రభుత్వం ఒక్కో వ్యక్తికి 5 కిలోల బియ్యం అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం కిలో బియ్యం ఇస్తోందన్నారు. కిలో బియ్యం అందించే రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులపై రెండు, మూడు ఫోటోలు ఏర్పాటు చేసుకుంటే.. 5 కిలోల బియ్యం అందిస్తున్న ప్రధాని మోదీ ఫోటో ఎందుకు పెట్టలేదని,రేషన్ కార్డులపై మోదీ ఫోటో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడు, అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి నరేష్, మండల బీజేవైఎం అధ్యక్షుడు జక్కుల సాగర్, ఓబీసీ అధ్యక్షుడు అమరకొండ దివాకర్, దేవి సంతోష్, ఎనగంటి రమేష్, ప్రశాంత్, రాకేష్, మేడిపల్లి రాజు, డి.మల్లేశం, కే.నరేష్, బెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక విద్యాశాఖను నిర్వీర్యం చేసే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి

## - పాలిటెక్నిక్ విద్యను శక్తి శాఖలో విలీనం చేయాలనే ఆలోచనను విరమించుకోవాలి

## - జీవో నంబర్ 97ను రద్దు చేయాలి: - ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రమ్ మాలిక్

**కోరుట్ల, ఆగస్టు 18 ప్రజాజ్యోతి**

సాంకేతిక విద్యాశాఖను నిర్వీర్యం చేసే నిర్ణయాలను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జగిత్యాల జిల్లా కార్యదర్శి అక్రమ్ మాలిక్ డిమాండ్ చేశారు. కోరుట్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను శక్తి శాఖలో విలీనం చేయాలనే ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని, పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను దెబ్బతీసే జీవో నంబర్ 97ను రద్దు చేయాలని ఆయన కోరారు.ఏఐఎస్ఎఫ్ జగిత్యాల జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం కోరుట్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తరగతులను బహిష్కరించి రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. కళాశాల ప్రాంగణం వరకు ర్యాలీ చేపట్టి ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అక్రమ్ మాలిక్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేసే కీలకమైన విద్యా వ్యవస్థ అని అన్నారు. అలాంటి విద్యా వ్యవస్థను ఇతర శాఖల్లో విలీనం చేయడం వల్ల సాంకేతిక విద్యకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ప్రైవేటీకరణ దిశగా వెళితే పేద, మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన డిప్లొమా విద్య అందుబాటులో లేకుండా పోతుందని అన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను మరింత అందుబాటులోకి తీసుకురావాల్సింది పోయి, వారిని విద్యకు దూరం చేసే నిర్ణయాలు తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని, జీవో నంబర్ 97ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో సాంకేతిక విద్యా మండలిని విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ఇందుకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం కూడా సానుకూల నిర్ణయం తీసుకుందని గుర్తు చేశారు.అయితే అనంతరం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి, ఐటీపరిశ్రమల శాఖ పరిధిలో కొనసాగిస్తున్నారని తెలిపారు. సాంకేతిక విద్యాశాఖ పరిధిలోకి తీసుకువస్తామని ప్రభుత్వం



గతంలో చెప్పినప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. తాజాగా ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో చేర్చాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీల వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొందని, వేలాది మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాసి పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరుతున్నారని అన్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, ప్రయోగశాలలను ఆధునీకరించాలని, వర్క్‌షాప్‌లు, హాస్టళ్లను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సాంకేతిక విద్యను బలోపేతం చేయాల్సింది పోయి ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే ప్రయత్నాలు చేయడం సరికాదని అన్నారు.సాంకేతిక విద్యాశాఖ పరిరక్షణ కోసం విద్యార్థుల పక్షాన ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాడుతుందని, ప్రభుత్వం తన నిర్ణయాలను వెనక్కి తీసుకోకపోతే మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని అక్రమ్ మాలిక్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కోరుట్ల అధ్యక్ష, కార్యదర్శులు ఓరుగంటి విష్ణుతేజ, గని నాయకులు ముజీబ్, జయదీప్, ఆస్లామ్, మహేందర్, కళాశాల సమితి సభ్యులు హర్ష, లోకేష్, భాస్కర్, అభిషేక్, రాజేష్, గ్రీష్మ, సౌమ్య, అక్షయ తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీపై కంది విత్తనాలు.. రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## - మండల వ్యవసాయ అధికారి మహేష్,

**ఎండపల్లి, ఆగస్టు 18, ప్రజా జ్యోతి**



వానాకాలం పంటల సాగుకు రైతులకు సబ్సిడీపై కంది విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. మండలానికి కంది ఎల్ఆర్జీ13333 రకం కలిగిన విత్తనాలు 95 బ్యాగులు మంజూరైనట్లు పేర్కొన్నారు.అలాగే రైతులు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విత్తనాలు పొందే రైతులు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ వద్ద తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని అధికారులు సూచించారు.

# కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై అబద్ధపు ప్రచారాలు మానుకోవాలి

**కోరుట్ల,ఆగస్ట్ 18 ప్రజాజ్యోతి**



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై బీఆర్ఎస్ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తూ అబద్ధపు ప్రచారాలు చేయడం మానుకోవాలని టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పథకాలపై లోప భూయిష్టమైన ఉత్తర్వుల కారణంగానే ప్రస్తుత న్యాయపరమైన సమస్యలు తలెత్తాయని పేర్కొన్నారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేయనుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు కల్లబొల్లి ప్రచారాలు మానుకోవాలని ఆయన సూచించారు.

# తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాత ప్రదర్శన

**జగిత్యాల రూరల్,ఆగస్టు18 (ప్రజాజ్యోతి):**

జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు ఆసరా పింఛన్లు, ఒంటరి మహిళా, బోధకాలు, డయాలసిస్ తదితర పింఛన్ల వివరాలపై పాటల ద్వారా ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించారు. అలాగే, వర్షాకాలంలో దోమల వ్యాప్తి వల్ల ప్రబలే వివిధ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటల రూపంలో ప్రజలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కళాకారులు పరుశురాం, ఎంవీ మల్లిక్ తేజ, అశోక్ భోగే, పలిగిరి రాజేందర్, ఆములవాడ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రదర్శనను తిలకించారు.



# అంగన్వాడీ కేంద్రానికి ఫ్యాన్ అందజేత

**రాయికల్, ఆగష్టు 18 (ప్రజా జ్యోతి)**

రాయికల్ మండలంలోని ఒడ్డెర కాలనీ అంగన్వాడీ కేంద్రానికి ఫ్యాన్ సౌకర్యం లేదని తెలుసుకున్న గ్రామానికి చెందిన వార్డు సభ్యురాలు సూర మాధురి-మురళి దంపతులు స్వచ్ఛందంగా ఫ్యాన్ అందజేశారు. చిన్నారుల ఇబ్బందులను గమనించి ఆయన ఫ్యాన్ కొని ఇవ్వడంతో అంగన్వాడీ టీచర్లు,గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన చేసిన సేవకు గుర్తుగా చిన్న సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించి శాలువాతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కొరకు రోజా-గణేష్ దంపతులు 10వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బోదాసు చంద్రశేఖర్ మాట్లాడుతూ సమాజంలో ఇలాంటి సహాయాలు ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోదాస్ రాజేష్, పంచాయతీ కార్యదర్శి అమీర్, అంగన్వాడీ టీచర్ బియ్యని సుజాత, ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు నవ్య శ్రీ స్కూల్ చైర్మన్ నరసమ్మ, వార్డు సభ్యులు వెంకటి, లక్ష్మీనారాయణ, వెంకమ్మ, ఆయమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# బీడీ కార్మికులకు చేయూత పథకం వర్తింపజేయాలి:

## జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్‌కు వినతి

**జగిత్యాల టౌన్, ఆగస్టు 18 (ప్రజా జ్యోతి):**

బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మంగళవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్‌కు బీడీ కార్మికులు వినతిపత్రం సమర్పించారు. బీడీ పరిశ్రమపై జీఎస్టీ పెంపు, పలు ఆంక్షల కారణంగా పని దినాలు తగ్గిపోయి కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. గతంలో లభించిన రూ.2,016 జీవన భృతి.. 2014 కటాఫ్ తేదీ నిబంధన వల్ల సుమారు 50 శాతం మంది అర్హులైన కార్మికులకు అందడం లేదని వివరించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆసరా పింఛన్ల దరఖాస్తులు స్వీకరిస్తున్నప్పటికీ, ఆన్‌లైన్‌లో బీడీ కార్మికుల జీవన భృతి వివరాలు కనిపించకపోవడంతో దరఖాస్తులను తిరస్కరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ఎన్నికల హామీ మేరకు కటాఫ్ నిబంధనను ఎత్తివేసి, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదయ్యేలా చర్యలు తీసుకొని, ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రతి కార్మికునికి చేయూత పథకం కింద నెలవారీ జీవన భృతి అందించి ఆదుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు.



# భక్తజన సంద్రమైన బీర్ పూర్ గుట్ట: అత్యంత వైభవంగా 'శ్రీ లక్ష్మీనరసింహస్వామి' గిరి ప్రదక్షిణ!

**బీర్‌పూర్, ఆగస్టు 18 (ప్రజా జ్యోతి):**

శ్రీ లక్ష్మీనరసింహస్వామి నామస్మరణతో బీర్ పూర్ పుణ్యక్షేత్రం మారుమోగింది. పవిత్రమైన శ్రావణ మాసం, స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం, మరియు మంగళవారం కలసివచ్చిన అత్యంత శుభదినాన.. ఈరోజు ఉదయం బీర్ పూర్ లక్ష్మీనరసింహస్వామి వారి గుట్టకు నిర్వహించిన "గిరి ప్రదక్షిణ" భక్తుల కోలాహలం మధ్య అత్యంత వైభవంగా, కనులపండువగా సాగింది.

### 'గోవిందా.. గోవిందా..' నామస్మరణల మధ్య ప్రారంభం

ఉదయం 08:00 గంటలకు గుట్ట కింద ఉన్న స్వామివారి రథ శాల వద్ద ఆలయ అర్చకులు, చైర్మన్, ధర్మకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించి గిరి ప్రదక్షిణను అధికారికంగా ప్రారంభించారు. ఈ మహోత్కర కార్యంలో పాల్గొనేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు, భజన బృందాలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో బీర్పూర్‌కు తరలివచ్చారు.

### భక్తిభావంలో మునిగితేలిన భక్తజనం

చేతుల్లో కాషాయ జెండాలు, స్వామివారి పటాలతో భక్తులు కాలినడకన గుట్ట చుట్టూ ప్రదక్షిణ చేశారు. దారిపొడవునా భజన బృందాల కీర్తనలు, మంగళవాయిద్యాలు, భక్తుల "గోవిందా.. గోవిందా.. నరసింహా.. నరసింహా.." అనే నినాదాలతో అడవి, గుట్ట పరిసర ప్రాంతాలన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మండుటెండను సైతం లెక్కచేయకుండా వృద్ధులు, మహిళలు, యువకులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ గిరి ప్రదక్షిణను పూర్తి చేసి స్వామివారిపై తమకున్న అపారమైన భక్తిని చాటుకున్నారు.

### ఘనంగా ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ

గిరి ప్రదక్షిణకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్, ధర్మకర్తల మండలి అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసింది. భక్తుల కోసం దారిపొడవునా తాగునీరు, సౌకర్యాలు కల్పించారు. ప్రదక్షిణ అనంతరం స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.





ఈ గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొనడం వల్ల స్వామివారి కృపాకటాక్షాలు లభిస్తాయని, గ్రామానికి, ప్రజలకు ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. భక్తులు, ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని అఖండ విజయవంతం చేయడంతో బీర్ పూర్ క్షేత్రంలో పండుగ వాతావరణం సంతరించుకుంది.

# సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

**కోరుట్ల, ఆగస్టు 18 ప్రజాజ్యోతి**

కోరుట్ల పట్టణంలోని జువ్వాడి కృష్ణారావు స్వగృహం జువ్వాడి భవన్‌లో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్‌తో కలిసి కాంగ్రెస్ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ, స్వయం పాలనకు పునాది వేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రజల కోసం, సమానత్వం కోసం పోరాడిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పన్నాల అంజిరెడ్డి, గడ్డం వెంకటేష్ గౌడ్, కొంతం రాజం, ఎం.ఏ. నయీమ్, ఏలేటి మహిపాల్ రెడ్డి, శంకర్ గౌడ్, నజ్జు నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మహాధర్నాకు ఉపాధ్యాయులు తరలిరావాలి

**కొడిమ్యాల,ఆగస్ట్ 18,(ప్రజాజ్యోతి):**

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 1న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్టీయూ-టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బూట్ల రాజమల్లయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ, డీఎస్సీ2003 ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు, పీఆర్‌సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాధర్నాకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముల్క శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి టి. అంజయ్య, జిల్లా బాధ్యులు నాంపల్లి రాజేశం, రాజయ్య, సదయ్య సుదర్శన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# బీర్ పూర్ మండలంలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**బీర్‌పూర్, ఆగస్టు 18 (ప్రజా జ్యోతి):**

జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలంలోని పలు గ్రామాల్లో బహుజన పోరాట యోధుడు, తెలంగాణ వీరపుత్రుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను మంగళవారం గౌడ సంఘం సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామ కూడళ్లలో పాపన్న గౌడ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, కొబ్బరికాయలు కొట్టి ఘన నివాళులర్పించారు. తెలంగాణ ప్రాంత ఆత్మగౌరవం కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటాలను, ఆయన చూపిన వీరత్వాన్ని ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. బహుజనుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ వేడుకల్లో బీర్ పూర్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల గౌడ సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సంఘ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు మరియు గౌడ యువతీ యువకులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.



# మోరపల్లి ప్రభుత్వ పాఠశాలలో వాటర్ ప్యూరిఫైయర్ ప్రారంభం

**జగిత్యాల రూరల్, ఆగస్టు 18(ప్రజాజ్యోతి):**


విద్యార్థులకు శుద్ధమైన, సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో మోరపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైయర్‌ను సర్పంచ్ కట్ట రాజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకునే ఈ సదుపాయం కల్పించామని, విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పంచాయతీ తరపున ఎప్పుడూ ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాలకవర్గ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# బీసీ మహిళలకు 100% సబ్సిడీతో ఉచిత కుట్టు మెషీన్లు!

**జగిత్యాల టౌన్, ఆగస్టు 18 (ప్రజా జ్యోతి):**

జగిత్యాల జిల్లాలోని వెనుకబడిన తరగతుల బీసీ మహిళలకు 100% సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మెషీన్ల పంపిణీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జయరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు గాను ప్రతి నియోజకవర్గానికి 1,000 చొప్పున ఈ మెషీన్లను పంపిణీ చేయనున్నారు. ఈ పథకానికి 18 నుండి 55 ఏళ్ల మధ్య వయసున్న బీసీ నిరుద్యోగ, వితంతు మరియు ఒంటరి మహిళలు అర్హులు. అర్హత మరియు ఆసక్తి కలిగిన లబ్దిదారులు సెప్టెంబర్ 13వ తేదీ లోపు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను సమర్పించుకోవాలని ఆయన సూచించారు.



పత్రికా ప్రకటన

K. JAYARAJ
(DBCDO)

# జగిత్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో 69 ఉద్యోగాల భర్తీకి వాక్ఇన్ ఇంటర్వ్యూలు

**జగిత్యాల టౌన్, ఆగస్టు 18 (ప్రజా జ్యోతి):**

జగిత్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఈనెల 24న వాక్ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. మొత్తం 69 పోస్టుల కోసం నిర్వహించే ఈ ఇంటర్వ్యూలు ఆ రోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కళాశాల ప్రాంగణంలోనే జరుగుతాయి. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ సంబంధిత విద్యార్హత ధ్రువపత్రాలతో నేరుగా హాజరుకావచ్చు. ఈ ఇంటర్వ్యూల ద్వారా ఎంపికైన వారిని 2027 మార్చి 31 వరకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుభాష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.


పత్రిక ప్రకటన

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైద్య విద్య శాఖ

ప్రభుత్వ వైద్య కళాశాల, జగిత్యాల నందు ఈ క్రింద తెలిపినటువంటి పోస్టులకి గాను ప్రభుత్వ ఉత్తర్వుల G.O.Rt.No.1276, Finance (HRM.VII) Dept., dt:16.07.2026. Govt. of Telangana., ప్రకారం కాంట్రాక్ట్ పద్ధతిలో 31.03.2027 వరకు ఎంపిక చేయుటకు ఈ క్రింద తెలిపినటువంటి పోస్టులకు అర్హతలు కలవారు తేది: 24.08.2026. ఉదయం 10:00 AM నుండి 05:00 PM వరకు ప్రభుత్వ వైద్య కళాశాల, జగిత్యాలలో జరుగు వాక్-ఇన్ ఇంటర్వ్యూకి హాజరు కాగలరు పూర్తి వివరాలకు www.gmcjagtial.com / https://jagtial.telangana.gov.in// వెబ్ చూడగలరు.

ఖాళీలు:

1. ప్రొఫెసర్స్ : 11
2. అసోసియేట్ ప్రొఫెసర్స్ : 29
3. అసిస్టెంట్ ప్రొఫెసర్స్ : 29

# మహిళా సమాఖ్య భవనానికి భూమిపూజ

**జగిత్యాల టౌన్, ఆగస్టు 18 (ప్రజా జ్యోతి):**

జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌లో రూ.10 లక్షల నిధులతో నిర్మించనున్న శ్రీ లక్ష్మి మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా సంఘాల భవనాల వల్ల గ్రామీణ మహిళలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ఇచ్చే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గజంగి నందయ్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడిగా మామిడి రాజు

**ఇల్లంతకుంట ఆగస్టు 18(ప్రజా జ్యోతి)**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఇల్లంతకుంట సర్పంచ్ మామిడి రాజు ఎన్నికైనారుఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎం. రాజు మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డికి, మండలంలోని సర్పంచ్‌లందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మండలంలోని సర్పంచ్‌లకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు.



# హరిదాస్ నగర్ అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీడీవో సత్తయ్య.....

**ఎల్లారెడ్డిపేట ఆగస్టు 18( ప్రజా జ్యోతి)**

ఎల్లారెడ్డిపేట మండలం లోని హరిదాసునగర్ గ్రామపంచాయతీ పరిధిలో జరిగే పలు అభివృద్ధి పనులను మంగళవారం రోజున ఎల్లారెడ్డిపేట ఎంపీడీవో సత్తయ్య చారి గ్రామంలోని ఐకెపి గోదాం పనులను మహిళా స్వశక్తి భవనాన్ని నిర్మాణం పనులను గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. వారి వెంట గ్రామ సర్పంచి నాగరాజ్ యాదవ్  ఏఈ శ్రీనివాస్ మూర్తి వెంకటేష్ తదితరులు ఉన్నారు..



# ఆటో డ్రైవర్ల రాష్ట్రవ్యాప్త నిరవధిక బంద్‌కు పిలుపు

### - కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆటో జేఏసీ తీవ్ర ఆగ్రహం
### - 21న పెద్దపల్లిలో భారీ ర్యాలీ.. 24 నుంచి నిరవధిక ఆటో బంద్
### - ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్




**పెద్దపల్లి ప్రతినిధి , ఆగస్టు 18 ప్రజా జ్యోతి:**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల సమస్యలు మరింత తీవ్రమయ్యాయని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆటో యూనియన్ల రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు మంద రవికుమార్ ఆరోపించారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం స్పందించక పోవడంతో ఈ నెల 24 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక ఆటో బంద్ చేపట్టనున్నట్లు ప్రకటించారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం అమలుతో ఆటో డ్రైవర్ల గిరాకీ గణనీయంగా తగ్గి, వారి ఆదాయంపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్లు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు, సంవత్సరానికి రూ.12 వేల మెయింటెనెన్స్ భృతి, ఇళ్లు లేని వారికి ప్రభుత్వ భూమిలో ఇళ్ల నిర్మాణం, ఆటో నగర్ల ఏర్పాటు వంటి హామీలు ఇచ్చిందని రవికుమార్ గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలుపై స్పష్టమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆటో డ్రైవర్లకు అండగా ఉంటామని, వారి సమస్యలను పరిష్కరిస్తామని గతంలో హామీ ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం 'ఆర్టీసీ ఆటో' ఆలోచన లేదని, ఆటో సంక్షేమ బోర్డుపై కేబినెట్‌లో చర్చ జరుగుతోందని మంత్రి ప్రకటించినప్పటికీ, కేవలం ఉద్యమాన్ని చల్లార్చేందుకే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారనే అనుమానం ఉందన్నారు. ముఖ్యమంత్రి సమక్షంలో స్పష్టమైన హామీ ఇచ్చి, దాని అమలుకు కార్యాచరణ ప్రకటించే వరకు ప్రభుత్వ ప్రకటనలను నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఆర్టీసీ ఉచిత బస్సు పథకం కారణంగా ఉపాధి కోల్పోయి, ఆర్థిక ఇబ్బందులతో దాదాపు 200 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని జేఏసీ నాయకులు ఆరోపించారు. ఇంతటి పరిస్థితి ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి, రవాణా మంత్రి తగిన స్థాయిలో స్పందించడం లేదని మండిపడ్డారు.

**21న పెద్దపల్లిలో భారీ ర్యాలీ**

-రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా ఈ నెల 21న పెద్దపల్లి బస్‌స్టాండ్ కార్నర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ఆటోల ర్యాలీ నిర్వహించనున్నట్లు మంద రవికుమార్ తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం స్పందించే తీరును బట్టి తదుపరి కార్యాచరణ ఉంటుందని హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా అన్ని ఆటో యూనియన్లు కలిసి బషీర్‌బాగ్‌లో ఆటో జేఏసీగా ఏర్పడ్డాయని, రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ నెల 24 నుంచి చేపట్టనున్న నిరవధిక బంద్‌ను విజయవంతం చేయాలని రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం నుంచి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో ఆటో జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్కే జబ్బర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జెరుపోతుల కుమార్, జిల్లా కన్వీనర్ ఎనగందుల నాంపల్లి, జిల్లా కో-కన్వీనర్ బండ సురేష్, జిల్లా కన్వీనర్ బందారపు కుమార్, రామగుండం ఇంచార్జి మడిపెద్ద రమేష్, మంథని నియోజకవర్గం ఇంచార్జి మడ్డి నర్సయ్య, పెద్దపల్లి కన్వీనర్ యాదగిరి శంకర్, నాయకులు ఈర్ల శంకర్, గాండ్ల సత్యానంద్, కందుల నర్సింగ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

# నేడు పెద్దపల్లి జిల్లాలో మంత్రుల పర్యటన

### - హాలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం
### - ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి ప్రతినిధి ఆగస్టు  18 ప్రజా జ్యోతి:**

ఆర్అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం (ఆగస్టు 19) పెద్దపల్లి జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని, రామగుండం ప్రాంతాల్లో ఆర్అండ్‌బీ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడంతో పాటు పలు బహిరంగ సభల్లో పాల్గొంటారు.మంత్రుల పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమాల నిర్వహణ, భద్రత, పారిశుధ్యం, తాగునీరు, ట్రాఫిక్ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. మంత్రుల పర్యటన విజయవంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.పర్యటన షెడ్యూల్: ఉదయం 11:30 గంటలకు పెద్దపల్లి ఐడీఓసీకి మంత్రులు చేరుకుంటారు. 11:45 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గర్రెపల్లి వద్ద ఆర్అండ్‌బీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 12:10 నుంచి 1:45 గంటల వరకు సుల్తానాబాద్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు.మధ్యాహ్నం 2 నుంచి 2:30 గంటల వరకు శివపల్లిలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు నివాసంలో భోజనం చేస్తారు. అనంతరం 3 నుంచి 4 గంటల వరకు మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆర్అండ్‌బీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 4:30 నుంచి 5:45 గంటల వరకు రామగుండంలో ఆర్అండ్‌బీ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు.మంత్రుల పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఆయా ప్రాంతాల్లో కార్యక్రమాలు సజావుగా జరిగేలా సంబంధిత

## యమలోక ప్రయాణంగా మారిందంటూ గ్రామస్తుల ఆగ్రహం

# ఇసుక లారీలతో రోడ్డు ధ్వంసం..







**వీణవంక,ఆగస్ట్ 18(ప్రజాజ్యోతి )**

పోతిరెడ్డిపల్లి నుంచి వీణవంక మండల కేంద్రంతో పాటు జిల్లా కేంద్రమైన కరీంనగర్‌కు నిత్యం వందలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. మానేరు వాగు నుంచి ఇసుక రవాణా కోసం పెద్ద సంఖ్యలో లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమై ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ పోతిరెడ్డిపల్లి ఇసుక క్వారీకి వందలాది లారీలు రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు వార్తలు వెలువడ్డాయని, రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలు, దెబ్బతిన్న రహదారి కారణంగా కనీసం ద్విచక్ర వాహనాలు సైతం సురక్షితంగా వెళ్లలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు చెబుతున్నారు. రెండు రోజుల క్రితం ఓ కుటుంబం ఇద్దరు చిన్నారులతో కలిసి మోటార్‌సైకిల్‌పై రెడ్డిపల్లి వైపు వెళ్తుండగా రోడ్డుపై ఉన్న గుంతలో పడి తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుందని తెలిపారు.

**ఇసుక వ్యాపారం కొనసాగించాలంటే ముందుగా రోడ్డు బాగు చేయాలి**

ఇసుక రవాణాతో క్వారీ యాజమాన్యానికి ఆదాయం వస్తున్నప్పటికీ, ప్రజలు మాత్రం అధ్వాన్నమైన రహదారిపై ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాత్కాలిక రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టి, ప్రజల రాకపోకలకు అనుకూలంగా మార్చిన తర్వాతే ఇసుక రవాణా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో పంజాల సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచులు మధుకర్, సమ్మయ్య, ఉపసర్పంచ్ రాపర్తి సంధ్య, గౌడ సంఘం నాయకులు రాపర్తి సతీష్, తాళ్లపల్లి శ్రీనివాస్, తాళ్లపల్లి రాజు, రాపర్తి కొండల్, పంజాల రవి, రాపర్తి శ్రీనివాస్, చేపూరి రాజు, బిక్షపతి, మునిగల రాజు, పానుగంటి రాజు, వార్డు సభ్యులు శ్రీధర్ రెడ్డి, శ్రీకాంత్, ఐలయ్య, మల్లేష్, రవి, సూర్యం తదితరులు క్వారీ వద్ద ధర్నాకు దిగారు.

**ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాలి**

ఇసుక రవాణా కారణంగా రోడ్డు దుస్థితిపై అధికారులు వెంటనే స్పందించి, ప్రమాదకరంగా మారిన రహదారికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో సంబంధిత అధికారులు క్వారీ యాజమాన్యంతో చర్చించి రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# వెంకటాపూర్ సబ్ సెంటర్ ను తనిఖీ చేసిన డీఎంహెచ్ ఓ డాక్టర్ ఎన్జీల ఆల్ ఫ్రైడ్....

**ఎల్లారెడ్డిపేట ఆగస్టు 18 (ప్రజా జ్యోతి)**

ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్ గ్రామ సబ్ సెంటర్ ను జిల్లా అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎన్జీల ఆల్ఫ్రెడ్ మంగళవారం ఎల్లారెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెంకటాపూర్ సబ్ సెంటర్ ను సందర్శించారు .సబ్ సెంటర్లో అందుతున్న వైద్య సేవలను సిబ్బంది హాజరు మందుల లభ్యత రికార్డు నిర్వహణ గర్భిణీ బాలంచర్ చిన్నారులు అందిస్తున్న ఆరోగ్య సేవలను పరిశీలించారు. ప్రజలకు ఆరోగ్య సేవలో సకాలంలో అందేలా సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు .గర్భిణీల ఆరోగ్య పరీక్షలు టీకాలు కుటుంబ సంక్షేమ సేవ సాధారణ సీజనల్ వ్యాధులను అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.



# వర్షాకాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పవిత్ర**

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 18 ప్రజా జ్యోతి:**

వర్షాకాలంలో సంక్రమిత వ్యాధుల నియంత్రణకు వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి, ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర సూచించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సూపర్వైజర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా, చికెన్‌గున్యా, టైఫాయిడ్ తదితర వ్యాధుల నివారణకు ఇంటింటి సర్వే నిర్వహించి అవసరమైన రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరాములు సూచించారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి వైద్య సంస్థలో వారానికి ఒకసారి 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమం నిర్వహించాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు.మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధులపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి వెంటనే చికిత్స అందించాలని జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు.గర్భిణులు, శిశువులకు నిర్ణీత సమయంలో టీకాలు అందించాలని, 1415 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ టీకా అందేలా చూడాలని మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ లక్ష్మీ భవాని సూచించారు. సమావేశంలో డీపీఎన్‌హెచ్ఓ దయామణి, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, సూపర్వైజర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



# అక్రమనిర్మాణాలపైమున్సిపల్ అధికారుల కొరడా

**వేములవాడ,ఆగస్టు,18:ప్రజాజ్యోతి.**

వేములవాడ పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు.. ముందుగా నోటీసులు జారీ చేసినప్పటికీ సరైన సమాధానం ఇవ్వకుండా నిర్మాణ పనులు కొనసాగించడంతో రెండు ఇళ్లను మంగళవారం అధికారులు సిబ్బంది సహకారంతో కూల్చివేశారు... పట్టణంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు.



# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**పెద్దపల్లి ప్రతినిధి ఆగస్టు 18 ప్రజా జ్యోతి:**

హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర టీజీఈజేఏసీ సమావేశంలో పెద్దపల్లి జిల్లా టీజీఈజేఏసీ కన్వీనర్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు తూము రవీందర్ పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లాలోని ఉద్యోగులు, అధికారుల సమస్యలను రాష్ట్ర టీజీఈజేఏసీ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.ఉద్యోగుల సమస్యలు, పెండింగ్ డిమాండ్ల పరిష్కారానికి కార్యాచరణ ప్రకటించి, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర స్థాయిలో కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.సమావేశానికి రాష్ట్ర టీజీఈజేఏసీ చైర్మన్ జగదీశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర జేఏసీ కమిటీ సభ్యులు, వివిధ ఫోరంల అధ్యక్షులు, అన్ని జిల్లాల చైర్మన్లు, కన్వీనర్లు, జంట నగరాల ఉద్యోగుల ప్రతినిధులు హాజరయ్యారు



# హక్కుల కోసం పోరాడిన సర్వాయి పాపన్న గౌడ్

- సర్పంచ్ ఎలుక అంజనేయులు

**తిమ్మాపూర్, ఆగస్టు 18( ప్రజాజ్యోతి ) :-**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 జయంతిని ఘనంగా నిర్వహించరు. అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగానివాళులర్పించారు.అనంతరం స్వీట్ పంపిణి చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఎలుక అంజనేయులు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తన కాలంలో సామాన్య ప్రజల హక్కుల కోసం ధైర్యంగా పోరాడి అణగారిన వర్గాలకు అండగా నిలిచి సమాజంలో సమానత్వం కోసం కృషి చేసిన మహనీయుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు.ప్రజల్లో ఆత్మవిశ్వాసం ధైర్యం సామాజిక చైతన్యం కల్పించడంలో సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని, సమాజంలో కుల,మత భేదాలకు అతీతంగా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ప్రజల కోసం పోరాడిన మహనీయుల చరిత్రను మనం గుర్తుంచుకోవాలి, వారి ఆశయాలను ఆచరణలో పెట్టడమే వారికి అందించే నిజమైన నివాళి అని సర్పంచ్ ఎలుక అంజనేయులు అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎలుక అంజనేయులు,మాజీ వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి,ఉపసర్పంచ్ ల్యాగల దేవేందర్ వార్డు సభ్యులుబోయిని శంకరయ్య, కొర్రి వంశీ,కనపర్తి చంద్రశేఖర్,బోయిని సతీష్ గౌడ సంఘం అధ్యక్షులు బొంగాని వీరయ్య,న్యాలం రాములు,గౌడ నాయకులు బొంగానిరాజు,బొంగాని రమేష్, బుర్రఅంజయ్య, గొల్లపెల్లి మల్లేశం,బొంగాని గౌరయ్య,గొల్లపెల్లి మొగిలయ్య, శ్రీనివాస్,బొంగాని ఐలయ్య,బొమ్మగాని ఎల్లయ్య, బొంగాని పర్శరాములు,గొల్లపెల్లి తిరుపతి,గంగారపు మల్లేశం గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# హక్కుల కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మానుక సత్యం.

**కోనరావుపేట,ఆగస్టు. 18(ప్రజాజ్యోతి)**

హక్కుల కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మానుక సత్యం అన్నారు. పాపన్న గౌడ్ 376 వ జయంతిని పురస్కరించుకొని కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మానుక సత్యం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తన కాలంలో సామాన్య ప్రజల హక్కుల కోసం పోరాడి అణగారిన వర్గాలకు అండగా నిలిచాడని కొనియాడారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంగలి దేవయ్య, పల్లి తిరుపతి, వెంగలి రాజశేఖర్,అవధూత శ్రీధర్, బందెల సదానందం, మల్యాల మనోజ్ కుమార్, గణేష్, దినకర్, తదితరులు పాల్గొన్నారు.



# మంథనిలో మంత్రుల పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి

- ఎన్ఎసి భవన నిర్మాణానికి భూమిపూజ
- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ బహిరంగ సభకు పక్కా ఏర్పాట్లు చేయాలి
- మంథనిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష





**మంథని, ఆగస్టు 18 (ప్రజాజ్యోతి) :**

మంథని నియోజకవర్గంలో బుధవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఇతర మంత్రులు పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మంథని పట్టణంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గంగపురిలో రేపు భూమిపూజ చేయనున్న ఎన్ఎసి భవన నిర్మాణ స్థలాన్ని, బస్సు డిపో సమీపంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన ప్రాంతాలను, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మంథనిలో ఎన్ఎసి భవన నిర్మాణానికి భూమిపూజతో పాటు రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరుగనున్నాయని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంతో పాటు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మంత్రుల పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తిచేసి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మంథని పట్టణంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలని, మంత్రులు పర్యటించే మార్గాలను ముందుగానే పరిశీలించి ఎలాంటి ఆటంకాలు లేకుండా రోడ్లు, పరిసరాలను క్లియర్ చేయాలని సూచించారు. పర్యటన షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలు నిర్ణీత సమయానికి జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమాల నిర్వహణలో సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వాహనాల పార్కింగ్, బారికేడింగ్ తదితర ఏర్పాట్లను పూర్తిస్థాయిలో చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంత్రుల పర్యటన విజయవంతం గా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో మంథని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్,వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ ఆరిఫుద్దీన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఫీల్డ్ హైవేకు ఆటంకాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి..

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష..

- టైటిల్ క్లియర్ ఉన్న రైతులకు పరిహారం చెల్లింపులు పూర్తి చేయాలి..

**ముత్తారం, ఆగస్టు,18 (ప్రజా జ్యోతి)**



మంచిర్యాలవరంగల్ గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ముత్తారం తహసిల్దార్ కార్యాలయంలో నేషనల్ హైవే నిర్మాణ పనుల పురోగతి, భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం చెల్లింపులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, మంచిర్యాలవరంగల్ గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులకు సంబంధించి నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల సమస్యల కారణంగా క్షేత్రస్థాయిలో పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నట్లు నేషనల్ హైవే అధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు.పోతారం, సర్వారం, ఓడేడు, లక్కారం ప్రాంతాలకు చెందిన రైతులు, నిర్వాసితులతో సమావేశంలో చర్చించిన కలెక్టర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టైటిల్ క్లియర్‌గా ఉన్న రైతులకు సంబంధించి పరిహారం చెల్లింపుల ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.నేషనల్ హైవే నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు రాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూసేకరణ, పరిహారం చెల్లింపులు తదితర అంశాల్లో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను రైతులతో చర్చించి పరిష్కరించాలని ఆదేశించారు. రైతులు, నిర్వాసితులకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని, సమస్యల కారణంగా జాతీయ రహదారి నిర్మాణ పనులు నిలిచిపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.రైతులకు నేషనల్ హైవే నిర్మాణానికి సంబంధించిన సమస్యలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.అనంతరం ముత్తారం మండలంలోని పోతారం గ్రామంలో జరుగుతున్న నేషనల్ హైవే నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారులి. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో మంథని ఆర్డిఓ సురేష్, నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్, ముత్తారం తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, సంబంధిత అధికారులు, పోతారం, సర్వారం, ఓడేడు, లక్కారం ప్రాంతాల రైతులు, నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ సహాయంలో "సఖి" కేంద్రం ముందుండాలి

## - అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే




సఖి సెంటర్ ద్వారా గృహహింస నిరోధక చట్టం2005 ప్రకారం,రాజ= కోర్టు నందు ఫైల్ చేస్తున్న కేసులు పెండింగ్ లేకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సమన్వయంతో బాధితులకు న్యాయ సహాయం అందించడంలో సఖి కేంద్రం ముందుండాలని సూచించారు.

కరీంనగర్ సఖి సెంటర్ 13వ మేనేజ్మెంట్ కమిటీ సమావేశం మంగళవారం సప్తగిరి కాలనీలోని సఖి కేంద్రంలో జరిగింది. నిర్వహించడం జరిగింది. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యలను సఖి సెంటర్ నిర్వాహకురాలు దామెర లక్ష్మి ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ రాజ= కోర్టు నుండి ప్రైవేటు అడ్వకేట్ ద్వారా ఫైల్ చేయబడుతున్న గృహహింస కేసులలో రక్షణాధికారి ద్వారా నిర్వహించబడే ఎంక్వయిరీ ఐ సి డి ఎస్ సిడిపిఓల సమన్వయంతో పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. సఖి సెంటర్ కి వస్తున్న బాధిత మహిళలు, బాలికలకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందించడంలో అనుబంధ శాఖలతో పాటు జిల్లా సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న అన్ని శాఖల సమన్వయం తో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. జీ ఓ నెం 28 ప్రకారం అందించబడే విక్టిమ్ కాంపెన్సేషన్ కేసులలో పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు . కరీంనగర్ జిల్లా పరిధిలోగల అన్ని పోలీస్ స్టేషన్లో వరకట్న వేధింపుల కింద నమోదైన కేసులలో స్టేటస్ వివరాలను అప్పగించాలని సూచించారు. సఖి సెంటర్లో కౌన్సిలింగ్ లో భాగంగా న్యాయ సలహాల ద్వారా బాధిత మహిళలు తీసుకున్న చర్యల రిపోర్టు అప్పగించాలని సూచించారుఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా విద్యాధికారి చైతన్య జైనీ, మెప్మా పీడీ స్వరూప రాణి, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

## - ప్రభుత్వం ఎమ్మెల్యే విజయ రమణారావు

**పెద్దపల్లి ప్రతినిధి ఆగస్టు 18 ప్రజా జ్యోతి:**



గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో గుర్తించి సర్పంచుల సమన్వయంతో సత్వరమే పరిష్కరించాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సూచించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్.కె. గార్డెన్స్‌లో ఎంపీడీఓ అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని 30 గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులతో గ్రామాల్లోని సమస్యలపై సమీక్షించారు. విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, వ్యవసాయం, మిషన్ భగీరథ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలను సర్పంచులు ప్రభుత్వ విప్, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. విజయరమణారావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, పెద్దపల్లి మండలంలో విద్యాభివృద్ధికి రూ.16 కోట్ల నిధులు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. నూతన పాఠశాల భవనాలు, మరమ్మతులు, కాంపౌండ్ వాల్స్, మరుగుదొడ్లు తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. తదుపరి మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ, మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**తిమ్మాపూర్, ఆగస్టు 18 ( ప్రజాజ్యోతి )**



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలు గౌడ సంఘము ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించరు ఈ సందర్భంగా ముఖ్య అతితులు గా గ్రామ సర్పంచ్ పొన్నం సునీత అనిల్ గౌడ్, ఉప సర్పంచ్ బూడిద కిశోర్,సంఘము అధ్యక్షులు కొయ్యేడ రాములు,ఉప అధ్యక్షులు మాచెర్ల నర్సయ్య, తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం తిమ్మాపూర్ మండలం అధ్యక్షులు రావుల శ్రీనివాస్ గౌడ్,గ్రామనాయకులు,వివిధ పార్టీల అధ్యక్షులు కొయ్యేడ శ్రీనివాస్ గౌడ్,పొన్నం అనిల్ గౌడ్,తాళ్లపల్లి కిరణ్ గౌడ్,గౌడ్ ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుచు తెలంగాణ ముద్దు బిడ్డ పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గురించి చాలా చరిత్ర ఉన్నది, అయన సబ్బండా వర్గాలను అందర్నీ కలుపుకొని జామిందార్లను ఎదురించి పన్నెండు వెయ్యిల మందిని సైన్యన్ని తయారు చేసుకొని గోల్కొండ కోటను స్వధీనం చేసుకొన్నా బహుబలివీరుడు సార్వాయి పాపన్న గౌడ్ ను మరిచి పోకూడదని రేపటి తరానికి చరిత్ర ను తెలియచేయాలని ఈ సందర్భంగా మాట్లాడటం జరిగింది,ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు బుర్ర కనుకయ్య గౌడ్, సుదగోనిపర్శరాములు గౌడ్,మార్క సరయ్య గౌడ్,రావుల సంపత్ గౌడ్,కొయ్యేడ తిరుపతి గౌడ్, కొయ్యేడ సమ్మయ్య గౌడ్,సుదగోని వేణు గౌడ్,సుదగోని శ్రవణ్ గౌడ్,కొయ్యేడ సమ్మయ్య గౌడ్, సుదగోని తిరుపతి గౌడ్,సుదగోని శ్రీనివాస్ గౌడ్, అనాగోని సంపత్ గౌడ్,అనాగోని శ్రీనివాస్ గౌడ్, కొలకాని రాజయ్య, రాయమల్లు, లచ్చయ్య,గట్టెపల్లి సాయి సంఘ సభ్యులు గ్రామ ప్రజలు పాలుగోని తధానంతరం స్వీట్ల పంపిణి చెయ్యడం జరిగింది.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు ఘన నివాళులు అర్పించిన మేయర్

**కరీంనగర్ కార్పొరేషన్, ఆగస్టు 18(ప్రజాజ్యోతి )**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా కరీంనగర్ నగరంలోని 15వ డివిజన్ చింతకుంటలో గల ఆయన విగ్రహానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ధైర్యసాహసాలకు, సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటానికి చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడిగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను నేటి యువతకు తెలియజేయడంతో పాటు, సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేయర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 15వ డివిజన్ కార్పొరేటర్ విప్పల సాయిజ్యోతి, 14వ డివిజన్ కార్పొరేటర్ గడ్డి ప్రదీప్, మాజీ ఎంపీటీసీ గుంజేటి శివకుమార్, కల్లు గీత సహకార సంఘం సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళులు అర్పించారు..



# పేదలకుఅన్నదానంతోపాటు పండ్లు వాటర్ బాటిల్స్ పంపిణీ

**వేములవాడ,ఆగస్టు,18:ప్రజాజ్యోతి.**

మై వేములవాడ సేవా ట్రస్ట్ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1956రోజులుగా నిర్వ హిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజున స్థానిక టిటిడి ధర్మశాల భీమేశ్వర రాజన్న ఆల యం వద్దపేదలకుఅన్నదానకార్యక్రమం తో పాటు పండ్లు వాటర్ బాటిల్స్ అంద జేయడం జరిగింది. నేటిఅన్నదాతలుగా లిఆయా చితుల.రాంప్రసాద్,వర్ధంతి సందర్భంగా కుమా రులు కొ డళు ృ,జితేందర్రావు,అమల, వెంకటేశ్వరరావు, ఆమనిదం పతులు అన్నదానం చేశారు. పుట్టినరోజు,పెళ్ళిరోజు,ఇతరత్ర కార్యక్రమాలకు పేదలకుఒక్క పూట అన్నదానం చేయలనుకునే దాత లు ట్రస్టు సభ్యులను గాని ట్రస్ట్ నంబరు 92469 39388 సంప్రదించాలని ట్రస్టు నిర్వాహకులు, మధుమహేష్ కోరారు .కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు. మ హేష్, వొడ్యాల. వేణు,ఎ౼లాస. రాజేందర్, సగ్గు.రాహుల్,ఆయాచితుల.జితేందర్,విష్ణు,శ్రీనివాసరావు,ముంజ.వెం కటేష్,గౌడ్ ,తదితరులుపాల్గొన్నారు.



# 15 కేసుల్లో శిక్షలు.. ప్రాసిక్యూటర్లకు సీపీ ప్రశంసలు

## - జూలై నెల నేర సమీక్ష నిర్వహించిన కరీంనగర్ సీపీ






**కరీంనగర్ క్రైం, ఆగస్టు 18, (ప్రజాజ్యోతి):**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో జూలై నెలకు సంబంధించిన నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 15 కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా సమర్థవంతంగా పనిచేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు సీపీ ప్రశంసలు కురిపించారు,కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణ, దర్యాప్తు పురోగతి,పెండింగ్ కేసుల పరిష్కారం,కోర్టు కేసుల్లో శిక్షల శాతం పెంపు, మహిళలు,చిన్నారులపై నేరాలు, సైబర్ నేరాలు,మాదకద్రవ్యాల నిర్మూలన,ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ నేరం జరిగిన వెంటనే శాస్త్రీయ ఆధారాలతో సమర్ధవంతంగా దర్యాప్తు పూర్తి చేసి,నిందితులకు శిక్ష పడేలా పోలీసు అధికారులు,పబ్లిక్ ప్రాసిక్యూటర్లు,కోర్టు డ్యూటీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు కోర్టు విచారణలో ఉన్న కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులపై నేరాలు,పోక్సో, అత్యాచారం తదితర కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండి బాధితులకు వీలైనంత త్వరగా నగదు రికవరీ చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీఈఐఆర్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేయడాన్ని వేగవంతం చేయాలని సూచించారు. మాదకద్రవ్యాలు, గుట్కా,పేకాట,అక్రమ ఇసుక రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని, ట్రాఫిక్ నిబంధనల అమలుతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సీపీ ఆదేశించారు.

### 15 ప్రధాన కేసుల్లో శిక్షలు...

జూలై నెలలో 15 ప్రధాన కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా సమర్థవంతంగా పనిచేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను సీపీ గౌష్ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి. శరత్ 6 కేసులు,పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. ప్రతాప్ 5 కేసులు,అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎ. రంజిత్ కుమార్ 2 కేసులు,జి. వీరస్వామి 2 కేసులు,గాయత్రి 1 కేసులో శిక్షలు సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు నుంచి 18 నెలల వరకు వివిధ కాలాల జైలు శిక్షలు విధించబడ్డాయి. బాధితులకు న్యాయం అందించడమే పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని, దర్యాప్తు నుంచి కోర్టు తీర్పు వరకు ప్రతి దశలో సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని సీపీ సూచించారు. సమావేశంలో అదనపు డీసీపీ వెంకటరమణ,డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి. కృష్ణమూర్తి,పబ్లిక్ ప్రాసిక్యూటర్లు,ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు,కోర్టు డ్యూటీ అధికారులు,ఇతర పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలి

## - ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్ బి.రాజ్

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 18( ప్రజాజ్యోతి )**

తెలంగాణ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్ బి.రాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో వారి చదువులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని శ్రావణ్ బి.రాజ్ ఆరోపించారు. మరోవైపు రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళనలు చేస్తుంటే వారిపై కేసులు నమోదు చేయడం, అరెస్టులు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయడంతో పాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.



# అమరుల యాదిలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర

**కరీంనగర్ టౌన్ ఆగస్టు 18( ప్రజా జ్యోతి )**



కరీంనగర్, ఆగస్టు 15: కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 2 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా “అమరుల యాదిలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర” నిర్వహిస్తున్నట్లు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి. రమణ తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని గీతాభవన్ చౌరస్తాలో జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతిగౌడ్ అధ్యక్షతన జరిగిన చైతన్య బస్సు యాత్రకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఎం.వి. రమణ మాట్లాడుతూ, గీత కార్మికుల పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని, ప్రమాదాల్లో మృతి చెందిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 30 నెలలు దాటినా హామీలు అమలు కాలేదని విమర్శించారు. వృత్తిలో ప్రమాదాలకు గురైన గీత కార్మికులకు చెల్లించాల్సిన సుమారు రూ.20 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు నిండిన గీత కార్మికులకు పెన్షన్ అందించేందుకు జీవో ఉన్నప్పటికీ, కొత్త దరఖాస్తులను స్వీకరించడం లేదని తెలిపారు. కొత్తగా ఎలాంటి డిమాండ్లు చేయడం లేదని, ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, వృత్తిలో ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం అందిస్తున్న లి‘కాటమయ్య రక్షణ కవచం’లిను అర్హులైన గీత కార్మికులందరికీ అందించాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 2.30 లక్షల మంది సభ్యులు ఉండగా, ఇప్పటివరకు కేవలం 30 వేల మందికే రక్షణ కవచం అందిందన్నారు. మిగిలిన వారందరికీ తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. తాటి, ఈత చెట్ల పెంపకానికి ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమి కేటాయించాలని, నీరా, తాటి–ఈత ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించాలని కోరారు. నందనంలోని నీరా ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలని, బడ్జెట్‌లో నీరాకు కేటాయించిన రూ.25 కోట్లు, గీత కార్మికుల సంక్షేమానికి కేటాయించిన రూ.67 కోట్లను తక్షణమే విడుదల చేసి వినియోగించాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకే చైతన్య బస్సు యాత్ర చేపట్టామని వెంకటేశ్వర్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ గౌడ, కల్లుగీత కార్మిక సంఘాలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు రాజకీయాలకు అతీతంగా యాత్రకు మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యాత్ర బృందం సభ్యులు బూడిది గోపి, ఉష, గౌని వెంకట నరసయ్య, గైని వెంకన్న, సాంబయ్య, కొండం కరుణాకర్, కుర్ర ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు కలర్ సత్తన్న, అధ్యక్షుడు కోడూరి పరశురాములు యాత్రకు మద్దతు తెలిపారు. అలాగే సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.నరేష్ పటేల్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ తదితరులు యాత్రకు మద్దతు ప్రకటించారు.

# ఘనంగా.సర్దార్ సర్వాయి పాపన్న జన్మదిన వేడుకలు

**కాల్వ శ్రీరాంపూర్ ఆగస్టు 19 ప్రజా జ్యోతి**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంతో. పాటు పెగడపల్లి తదితర గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న 376జన్మదిన వేడుకలను మంగళవారం రోజున ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఆయన చేసిన త్యాగాలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ మాజీ జెడ్పిటిసిలు. లంక సదయ్య వంగల తిరుపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గా జన వేణసరయ్య. యూత్ అధ్యక్షులు సోన్నాయి టె కం శివరామకృష్ణ.వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి. సర్పంచులు బంగారి రమేష్. జిన్న రామచంద్రారెడ్డి.ఉప సర్పంచులు. గోలి సుధాకర్. ధర్మల రవి. మేడి అశోక్. మాజీ ఎంపీటీసీలు పొట్యాల మొండయ్య గౌడ్. పో చాల సదానందం గౌడ్. తదితరులు పాల్గొన్నారు.

